www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 30 ఆగస్టు 2024

5



1న అండర్-14 క్రికెట్ జట్టు ఎంపికలు

ప్రజాశక్తి - కడప

అండర్ -14 జిల్లా క్రికెట్ జట్టు ఎంపికలు సెప్టెంబర్ 1న ఆదివారం కడప నగరం వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎ.రెడ్డిప్రసాద్ తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఎంపికలకు హాజరు కావాలని కోరారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు తమతోపాటు ఆధార్ కార్డు కాపీ, బర్త్ సర్టిఫికెట్(ఫారం5), పాస్ పోర్ట్ సైజ్ ఫోటో, స్టడీ సర్టిఫికెట్ ఒరిజినల్‌తో పాటు ఒక సెట్టు జిరాక్స్ తీసుకురావాలని తెలిపారు. ఎవరి క్రికెట్ కిట్ వారే తెచ్చుకోవాలని సూచించారు. ఉదయం 7:00 గంటలకు వైఎస్ఆర్ ఎసిఎ స్టేడియానికి హాజరు కావాలన్నారు. తెలిపారు. ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు 2010 సంవత్సరం సెప్టెంబర్ 1 నుంచి 2012 సంవత్సరం ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలని తెలిపారు.

తెలుగు భాష ప్రాచీనతను కాపాడుకోవాలి

- మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు



గిడుగు రామమూర్తి జయంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న వెంకయ్యనాయుడు

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల

భాషా ప్రాచీనతను పరిరక్షించుకోవటంతో పాటు భాష మనుగడను కాపాడుకోవటం అత్యంత ఆవశ్యకమని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. గురువారం కడప జిల్లా ఎర్రగుంట్ల మండలంలోని కలమల్లలో తొలితెలుగు శిలాశాసనం వెలుగు చూసిన చెన్నకేశవస్వామి ఆలయ ప్రాంగణంలో గిడుగు వెంకట రామమూర్తి జయంతిని పురస్కరించుకుని జిల్లా యంత్రాంగం ఘనంగా నిర్వహిస్తున్న తెలుగుభాషా దినోత్సవ వేడుకలకు వెంకయ్యనాయుడు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సందర్భం ద్వారా ఓ మహోన్నత ప్రాచీన భాషకు వారసుడిగా గర్విస్తున్నాని, ఈ విషయంలో ప్రతి ఒక్కరూ గర్వపడాలని సూ చించారు. చొరవ తీసుకుని కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన కలెక్టర్ సహా ప్రతి ఒక్కరినీ ఆయన మనసారా అభినందించారు. గిడుగు స్ఫూర్తితో యువతరం తెలుగు భాష, సంస్కృతులను కాపాడుకోవాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. తెలుగు భాష ఎంత ప్రాచీనమైనదో, మన సంస్కృతి కూడా అంతే ప్రాచీన మైందన్నారు. భారతదేశంలో నాలుగో అతిపెద్ద భాషగా మన్ననలు అందు కుంటున్న తెలుగు, ప్రపంచ వ్యాప్తంగా మరెన్నో దేశాల్లోనూ తన ప్రాభవాన్ని చాటుతున్న విషయాన్ని గుర్తు చేసిన ఆయన, ఉత్తమ లిపిగా, అజంతా భాషగా తెలుగు అందుకున్న గౌరవాలను ప్రస్తావించారు. తెలుగు లాంటి మహోన్నత భాష ప్రాచీనతకు శిలాశాసనాలు సాక్ష్యంగా నిలుస్తాయన్న వెంకయ్యనాయుడు, శాసనాలను రాళ్లు, రప్పలుగా గాక మన సంస్కృతికి సంబంధించిన గొప్పలుగా చూడాలని ఆకాంక్షించారు. శాసనాల ప్రాచీనత మీద వ్యక్తమౌతున్న సందేహ విషయంలో మరిన్ని పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉందన్న ఆయన, ఇలాంటి శాసనాల భాష మీద ఆసక్తి పెంపొందే విధంగా చొరవ పెరగాల్సిన అవసరం ఉందని ఆకాంక్షించారు. శాసనాల పరిరక్షణ విషయంలో తమిళ నాడును ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్న ఆయన, తెలుగు భాష పరిరక్షణ, శాసనాలను సంరక్షణ కోసం ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలని ఆకాంక్షించారు. కలెక్టర్ శివశంకర్ లోతేటి మాట్లాడుతూ తెలుగులో అతి ప్రాచీనమైన సాహిత్యం సుమతి శతకం, బద్దెన కావ్యాలు మన కడప జిల్లా నుండే ఉద్భవించడన్న విషయం గర్వించ దగ్గదన్నారు. దాదాపు 1500 సంవత్సరాల క్రితం నాటి చారిత్రక నేపథ్యం ఉన్న తెలుగు తొలి శాసనం మన ప్రాంతంలో కొలువై ఉండడం మన అదృష్టంగా భావిస్తున్నామన్నారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ తెలుగు భాషలో తొలి శిలాశాసనం వెలసిన ఈ కలమల్ల తెలుగు తేనెల దారులతో పునీతమైందన్నారు. తెలుగు భాషా ఉన్నతమైందని, పవిత్రమైందని నేతలన్న సరళమైందని పేర్కొన్నారు.

తెలుగు కవులకు సన్మానం : తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా అతిథుల చేతుల మీదుగా జిల్లాలో ప్రసిద్ధ తెలుగు కవులు షేక్ హుస్సేన్ (సత్యాగ్ని), నరాల రామిరెడ్డి, డాక్టర్ పి.సంజీవమ్మ, సన్నపురెడ్డి వెంకట రామిరెడ్డి, తవ్వా ఓబుల్ రెడ్డి లను దుశ్శాలువ, జ్ఞాపికలతో సన్మానించారు. సభ ప్రారంభానికి ముందు శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకున్న అనంతరం కలమల్ల శిలాశాసనాలు నెలకొల్పిన ప్రదేశంలో ఏర్పాటు చేసిన తెలుగు భాష ప్రాచీన, పూర్వ వైభవాన్ని ప్రతిబింబించే ఛాయా చిత్రాల గ్యాలరీలను తిలకించి తెలుగు శిలా శాసనాల ప్రాశస్త్యాన్ని తెలుసుకున్నారు. కార్యక్రమంలో జెసి అదితి సింగ్, జడ్‌పి సిఇఒ సుధాకర్‌రెడ్డి, డిఇఒ అనూరాధ, డిఎస్‌ఒ సందీప్‌రెడ్డి, టిడిపి నాయకులు భూపేష్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, భాషా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

- క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలి
- కలెక్టర్ శివశంకర్ లోతేటి

ప్రజాశక్తి - కడప

క్రీడల వల్ల భౌతిక వికాసం, దేహదారుఢ్యం పెరుగుతుందని ప్రతి ఒక్కరూ ఏదో ఒక క్రీడను జీవితంలో భాగంగా పెట్టుకోవాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి అన్నారు. గురువారం స్థానిక డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ మైదానంలో డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో హాకీ దిగ్గజం ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకొని నేషనల్ స్పోర్ట్స్ డేలో భాగంగా వివిధ రకాల క్రీడాకారులకు పోటీలను నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువత, విద్యార్థులతో పాటు క్రీడలలో కూడా రాణించి ఉన్నత స్థితికి ఎదగాలని అన్నారు. క్రీడలలో మెళ కువలను తెలుసుకొని రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో రాణించి, జిల్లాకు, రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకు రావాలన్నారు. క్రీడా దినోత్సవం సందర్భంగా నెల 25 నుంచి అనేక కార్యక్రమాలు 20 రకాల క్రీడా పోటీలను నిర్వహించి, జిల్లాస్థాయిలో పోటీలను నిర్వహించి క్రీడాకారులు అందరికీ కూడా బహు మతులు అందజేశామని చెప్పారు. ముందుగా ర్యాలీ నిర్వహించి యువత, విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని నింపామన్నారు. అనంతరం పోటీలలో గెలుపొందిన క్రీడాకారులకు శాలువతో సత్కరించి జ్ఞాపికలను కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. అంతకు ముందు స్థానిక కోటి రెడ్డి సర్కిల్ వద్ద కలెక్టర్ చేతుల మీదుగా 3 కి మీటర్ల ర్యాలీని క్రీడాజ్యోతిని వెలిగించి, జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ కోటిరెడ్డి సర్కిల్ నుంచి ప్రారంభమై 7 రోడ్లు, పాత బస్ స్టాండ్, శ్రీకృష్ణ దేవ రాయలు విగ్రహం మీదుగా డిఎస్ ఏ స్టేడియం (మున్సిపల్ స్టేడియం) వరకు కొనసాగి ముగిసింది. కార్యక్రమంలో డిఎస్‌డిఒ జగన్నాథ్ రెడ్డి, స్టెప్ సిఇఒ సాయి గ్రెస్, వివిధ క్రీడల క్రీడాకారులు పాల్గొన్నారు. **ఆర్ట్స్ కళాశాలలో..** జాతీయ క్రీడ దినోత్సవ సందర్భంగా 30 ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ అధికారి కల్నల్ సూర్యనారాయణ మూర్తి ఆదేశాల మేరకు ప్రభుత్వ పురుషుల కళాశాల ఎన్‌సిసి కేడెట్ల చేత కళాశాల నుంచి కలెక్టర్ కార్యాలయం, సైనిక సర్కిల్ మీదుగా, కోటిరెడ్డి సర్కిల్, ఏడు రోడ్ల కూడలి వరకు 3 కిలోమీటర్ల నడక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో లెఫ్టినెంట్ నీలయ్య, మహేష్ , పెరేడ్ శిక్షకులు సుబేదార్ అనిల్, సి.ఎల్.ఎన్.రెడ్డి, కేడెట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



ధ్యాన్‌చంద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి

'విద్యుత్ సమస్యలపై 5న తిరుపతిలో ఆందోళన'



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యుత్ కార్మికులు సమస్యలపై సెప్టెంబర్ 5న తిరుపతిలోని ఎస్‌పిడిసిఎల్ వద్ద నిర్వహించే ఆందోళనను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని విద్యుత్ భవన్ సిఐటియు ఆధ్వర్యంలో విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారం కేఓసం చలో తిరుపతి పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోనిప్రతి విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుడు తరలిరావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా 23,500 మంది విద్యుత్ కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరారు. 2022 పిఆర్‌సి అరియర్స్ ఇవ్వాలని తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న అన్‌స్కిల్డ్ కార్మికులకు స్కిల్ చేసి స్కిల్డ్ వేతనం ఇవ్వాలని, కొత్త ఆపరేటర్లకు పాతఆపరేటర్లకు సమానంగా జీవితాలు ఇవ్వాలని తెలిపారు. ప్రతి సబ్ స్టేషన్‌లో నైట్ వాచ్ మెన్‌ను నియమించాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఐటిఐ విద్యార్హత ఉన్న అన్‌స్కిల్డ్ కార్మికులకు స్కిల్డ్ చేసి స్కిల్ వేతనం ఇవ్వాలని పేర్కొన్నారు. మీటర్ బిల్ ఏజెన్సీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని పేర్కొన్నారు. ఎస్‌పిఎం కార్మికులకు కనీస వేతనం, ఇపిఎఫ్, ఇఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని, ప్రతి సబ్ స్టేషన్‌లో నైట్ వాచ్‌మెన్‌ను నియ మించాలని. పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలను చేపట్టాలని పేర్కొన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ ,10 లక్షలు ఇవ్వాలని కోరారు. కార్మికుడి గాని, కార్మిక కుటుంబాల్లో గాని ఏదైనా అనారోగ్య సమస్య గాని, యాక్సిడెంట్లు సమస్య గాని వచ్చినప్పుడు పూర్తిగా ఉచితంగా ప్రభుత్వమే వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. వర్కర్స్ రాష్ట్ర నాయకులు రియాజ్ మాట్లాడుతూ రాష్ట్రంలో రెండేళ్లుగా పనిచేస్తున్న 23,500 విద్యుత్ కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరారు. పెండింగ్ లో ఉన్న కారుణ్య నియామకాలను చేపట్టాలని. పోస్టర్ విడుదల కార్యక్రమంలో డిస్కం ప్రెసిడెంట్ శివశంకర్, ఏపీ ట్రాన్స్‌కో నాయకులు నూర్‌బాషా, కడప డివిజన్ నాయకులు శివ ప్రసాద్ రెడ్డి దేవదానం, ట్రాన్స్‌ఫార్మర్ డివిజన్ నాయకులు నందీశ్వర్ రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, విద్యుత్ కాంటాక్ట్ కార్మికుల నాయకులు రియాజ్, ప్రసాద్ పాల్గొన్నారు.

బిటెక్ విద్యార్థి ఆత్మహత్య

ఆలస్యంగా వెలుగులోకి..
ర్యాగింగే కారణమంటున్న కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి - మైదుకూరు/ కలికిరి

మైదుకూరు మండలానికి చెందిన బిటెక్ విద్యార్థి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కళాశాలలో ర్యాగింగ్ చేయడం వల్లే తమ బిడ్డ చనిపోయాడంటూ అతని బంధువులు పేర్కొంటున్నారు. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మైదుకూరు మండలం జి.వి. సత్రానికి చెందిన నాగేంద్రకు ఇద్దరు కుమారులు. వారిలో రెండో కుమా రుడు ప్రవీణ్ (21) అన్నమయ్య జిల్లా పీలేరు నియోజకవర్గంలోని కలికిరి జెఎన్‌టియు కళాశాలలో బిటెక్ రెండో సంవత్సరంలోకొత్తగా చేరాడు. కొద్ది రోజు లుగా ప్రవీణ్‌ను కళాశాలలోని కొందరు సీనియర్లు ర్యాగింగ్ చేశారు. దీంతో అతను ఈనెల 25న ఇంటికి వచ్చేశాడు. కుటుంబ సభ్యులు తిరిగి కళాశాలకు వెళ్లాలని చెప్పడంతో ఏం చేయాలో తెలియక, ఈనెల 26న అతను ఇంట్లో ఉన్న పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స కోసం వెంటనే తిరుపతి రుయాకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం మృతిచెందారు. తమ బిడ్డ ఉన్నత చదువులు చదివి తమకు చేదోడు వాదోడుగా ఉంటాడని అనుకున్న కుమారుడు తమకు పుత్ర శోకాన్ని మిగిల్చాడని తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఈ సంఘటనపై మైదుకూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి పిర్యాదు మేరకు మైదుకూరు పోలీసులు కలికిరి జెఎన్‌టియు కళాశాలకు చేరుకుని కలికిరి సిఐ రెడ్డి శేఖర్ రెడ్డి సాయంతో ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావును, తోటి విద్యార్థులను విచారించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రవీణ్ ఆగస్టు 12న డిటెక్ సెకండియర్‌లో జాయిన్ అయ్యాడని, అదే రోజు లగేజ్ కోసం ఇంటికి వెళ్లి 20న కళాశాలకు వచ్చి మూడు రోజులు క్లాసులకు హాజరయ్యాడని తెలిపారు. 23 సాయంత్రం హాస్టల్ నుంచి ఎవరికీ చెప్పకుండా ఇంటికి వెళ్ళిపోయాడని, తర్వాత 26న మృతుని తండ్రి ఫోన్ చేసి ఆత్మహత్య చేసుకున్నట్లు చెప్పడంతో నివ్వెరిపోయామని చెప్పారు. గురువారం పోలీసులు వచ్చి విచారించారని, ర్యాగింగ్ నిజమని తేలితే బాధితులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కళాశాలలో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు.



ప్రవీణ్ (ఫైల్‌ఫొటో)



ఆలిండియా టోర్నమెంట్‌కు ఎంపికైన క్యారమ్స్ క్రీడాకారులు


ముగిసిన 'ఎల్ఐసి' టోర్నమెంట్

ప్రజాశక్తి -కడప అర్బన్

జోనల్ సెలక్షన్ ట్రయల్స్‌లో విజేతలు నేషనల్ ఛాంపియన్స్ కూడా కావాలని ఎల్‌ఐసి సీనియర్ డివిజనల్ మేనేజర్ జి.కే.ఆర్.వి రవికుమార్ అన్నారు. రెండు రోజులుగా నిర్వహిస్తున్న సౌత్ సెంట్రల్ జోనల్ చెస్, క్యారమ్స్ సెలక్షన్ ట్రయల్స్ -2024 గురువారం ముగిసంపు సభ నిర్వహించారు. సభలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. చెస్ సెలక్షన్స్‌కు ప్రఖ్యాత ఇంటర్నేషనల్ ఆర్బిటర్ అమ్మినేని ఉదయ్ కుమార్ చీఫ్ ఆర్బిటర్‌గా వ్యవహరించారు. విజేతలకు ఆయనతోపాటు సత్య శ్రీనివాస్, పర్సనల్ మేనేజర్ విజేతలకు బహుమతులు అందజేశారు. భారత ప్రఖ్యాత హాకీ ఆటగాడు ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం నిర్దేశాల మేరకు మూడు రాష్ట్రాల ఆటగాళ్లు టోర్నమెంట్ సందర్భంగా నేషనల్ స్పోర్ట్స్ డే పాటించారు. కార్యక్రమంలో ఎల్‌ఐసి స్పోర్ట్స్ ప్రమోషన్ మెంబెర్ సురేష్, డివిఎన్ శర్మ, డివిజన్ స్పోర్ట్స్ కమిటీ మెంబర్ జె.రఘు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు భరోసా

ప్రజాశక్తి- కడప అర్బన్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మన్నూర్ అక్బర్

నిరుద్యోగ యువతకు కొప్పర్తి పరిశ్రమ భరోసాగా ఉందని, ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తూనే ఉద్యోగ, ఉపాధి అవకాశలు కల్పించబోతున్నారని టిడిపి కడప జిల్లా అధికార ప్రతినిధి మన్నూర్ అక్బర్ అన్నారు. గురువారం పాత బస్టాండ్ సమీపంలోని మన్నూరు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొప్పర్తి, ఓర్వకల్లు ద్వారా నిరుద్యోగ యువతకు ప్రత్యక్షంగా లక్ష ఉద్యోగాలు, పరోక్షంగా మరో రెండు, మూడు లక్షల పైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. అంతే కాకుండా రాష్ట్ర ఖజానాకు వందల కోట్లల్లో వివిధ రకాల పన్నుల రూపంలో ఆదాయం వస్తుందన్నారు. రాయలసీమలో వెనుకబడిన కమలాపురం నియోజకవర్గంలో యువతకు ఉపాధి అవకాశం కల్పిస్తామని ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి చెప్పడం కొప్పర్తి పారిశ్రామికవాడా ద్వారా నెరవేరాబోతుందన్నారు. ఎన్నికల హామీ మేరకు ముఖ్యమంత్రి ద్వారా కొప్పర్తి పారిశ్రామిక వాడా అభివృద్ధి చేస్తామని యువతకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని ప్రజలకు గుర్తు చేశారు. సమావేశంలో బాబయ్య, రూపానగుడి హుస్సేన్ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి : ఎస్‌పి

ప్రజాశక్తి - కడప అర్బన్

ఉద్యోగరీత్యా విధుల్లో ఉండే పోలీస్ సిబ్బంది తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎస్‌పి వి.హర్షవర్ధన్ రాజు సూచించారు. గురువారం పోలీస్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు జిల్లా పోలీస్ సంక్షేమ ఆస్పత్రిలో జైడస్ హెల్త్ కేర్ వారి సహకారంతో ఏర్పాటు చేసిన అత్యాధునిక లివర్ ఫైబ్రో స్కాన్ (కాలేయ పనితీరు) పరీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ పోలీస్ సంక్షేమంలో భాగంగా ఖరీదైన లివర్ ఫైబ్రో స్కాన్ పరీక్షలను ఉచితంగా అందిస్తున్నారని తెలిపారు. పోలీసు సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని, సకాలంలో వ్యాధికి చికిత్స తీసుకుని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించాలని ఆకాంక్షించారు. సెప్టెంబర్ 3, 4 తేదీల్లో విజయవాడ మణిపాల్ హాస్పిటల్ వైద్యుల పర్యవేక్షణలో 45 సంవత్సరాలు నిండిన, వివాహమై 20 సంవత్సరాలు అయిన మహిళా పోలీసు సిబ్బందికి, వారి కుంటుంబంలోని మహిళలకు ఉచిత కేన్సర్ నిర్ధారణ పరీక్షల శిబిరం ఏర్పాటు చేయబోతున్నామని చెప్పారు. ఇందులో పాప్ స్మియర్, మామోగ్రాం పరీక్షలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్‌పి ఎస్.ఎస్.వి కృష్ణారావు, పోలీస్ సంక్షేమ వైద్యశాల వైద్యురాలు డాక్టర్. మేరీ సుజాత, ఆర్ఐలు ఆనంద్, శ్రీశైల రెడ్డి, టైటస్, వీరేష్, పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, జైడస్ హెల్త్ కేర్ టెక్నీషియన్ తరుణ్, పోలీస్ సంక్షేమ ఆస్పత్రి సిబ్బంది ప్రసాద్, రమణారెడ్డి, పోలీస్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

భవిష్యత్ మార్గదర్శకులు ఆంగ్ల ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-కడప అర్బన్

గ్రామీణ విద్యార్థుల భాష నైపుణ్యాలు పెంపొందించగలిగితే ప్రపంచ పోటీలో దీటుగా నిలబడతారని ఆ దిశగా ఆంగ్ల భాష ఉపాధ్యాయులు కృషి చేయాలని యోగి వేమన విశ్వవిద్యాలయం విసి ఆచార్య కె. కృష్ణారెడ్డి అన్నారు. గురువారం వైవీయూ ఆంగ్ల శాఖ ఆధ్వర్యంలో ఆంగ్ల భాష నైపుణ్యాలు ఉన్నత పాఠశాల స్థాయిలో బోధన విధానాలపై విశ్వవిద్యాలయంలో సదస్సు సమన్వయకర్త డాక్టర్ ఆర్.వి.జయంత్ కశ్యప్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విసి కె. కృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దడంలో ఆంగ్ల భాష ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు చిన్న చిన్న పదాలతో ప్రారంభించి ఆంగ్ల భాష పట్ల ఆసక్తిని పెంచాలన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన హైదరాబాద్ ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజ్ విశ్వ విద్యాలయం (ఇఫ్లూ) రిజిస్ట్రార్ ఆచార్య కేదారి నరసింహారావు మాట్లాడుతూ ఆంగ్ల భాష ఉపాధ్యాయులు బోధన సామర్థ్యాలను నిరంతరం పెంపొందించుకోవాలన్నారు. సమకాలీన, సామాజిక, ఉద్యోగ అవకాశాలు అందుకునేలా విద్యార్థులకు ఆశావహ దృక్పథం కల్పిస్తూ, సమర్థవంతమైన తర్ఫీదునివ్వాలన్నారు భాషా బోధన చేసే సమయంలో భాష పట్ల జిజ్ఞాసను, ప్రశ్నించే తత్వాన్ని విద్యార్థుల అలవాటుగా మార్చాలన్నారు. ఆదర్శ ఉపాధ్యాయుల లక్ష్యాలు, లక్షణాలను మన పురాణాలు ఎలా మార్గదర్శకం చేశాయో శాస్త్రబద్ధంగా వివరించారు. మరో విశిష్ట అతిథి ఇఫ్లూ ఆచార్యులు ఆర్.కిషోర్ కుమార్ మాట్లాడుతూ శిక్షణలకు కేవలం హాజరు కోసం కాకుండా , నేర్చుకోవాలనే దృక్పథంతో రావాలని కోరారు. శిక్షణలో పొందిన జ్ఞానాన్ని తరగతి గదిలో విద్యార్థికి చేరువైనప్పుడు సత్ఫలితాలు వచ్చినట్లున్నారు.

మూత్రపిండ శస్త్రచికిత్స విజయవంతం

- యశోద ఆస్పత్రి వైద్యులు డాక్టర్ సూర్య ప్రకాష్

ప్రజాశక్తి - కడప అర్బన్



మాట్లాడుతున్న డాక్టర్ సూర్యప్రకాష్

నగరంలోని పెద్ద దర్గా ప్రాంతంలో నివాసం ఉంటున్న రహమతు బాషాకు మూత్రపిండం ట్యూమర్ పూర్తిగా తొలగించే శస్త్ర చికిత్సను సోమా జిగూడలోని యశోద ఆస్పత్రిలో విజయ వంతంగా నిర్వహించామని ప్రముఖ యూరాలజీ వైద్యులు డాక్టర్ సూర్య ప్రకాష్‌వద్ది తెలిపారు. గురువారం నగరంలోని ఎర్రముక్కపల్లి సర్కిల్ వద్ద ఉన్న యశోద బ్రాంచ్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహమతు బాషా నడుం నొప్పి, మూత్రంలో రక్తం రావడం సమస్యతో బాధపడుతూ యశోద హాస్పిటల్స్ వచ్చారని పేర్కొన్నారు. వైద్య పరీక్షలు అనంతరం మూత్రపిండ ట్యూమర్ త్రోమ్బస్ కాలేయం వెనుక డయా ఫ్రాగమ్ వరకు విస్తరించినట్లు గుర్తించామన్నారు. ఫిబ్రవరి ఒకటో తేదీ శస్త్ర చికిత్స విజయవంతంగా పూర్తి చేశామని తెలిపారు. యూరాలజీ కార్డియాలజిస్ట్ క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్ అనస్థీషియా టీంగా ఏర్పడి ఐదు గంటలు శ్రమించి శస్త్రచికిత్స చేశామని చెప్పారు. రోబోటిక్ టెక్నాలజీతో తక్కువ కోతతో శస్త్ర చికిత్సలు చేస్తున్నామని పేర్కొన్నారు. రహమతు బాషా అత్యంత క్లిష్టమైన ఇతర సంబంధిత వ్యాధుల నుంచి పూర్తిగా కోలుకున్నారని తెలిపారు. సమావేశంలో డాక్టర్ ఆంజనేయులు, పవన్ పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే మాధవి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - కడప అర్బన్ : నగరంలోని పట్టణ నిరాశ్రయుల వసతి గృహంలో 44వ డివిజన్ ఇన్‌ఛార్జి, కడప నగర మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఖాజా పీర్ ఆధ్వర్యంలో కేక్ కట్టింగ్ చేశారు. వృద్ధుల, నిరాశ్రయుల మధ్య ఎమ్మెల్యే మాధవి జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే మాధవి కడప నియోజకవర్గం కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. పుట్టినరోజు వేడుకలు మరిన్ని జరుపుకుని, మరింత ఉన్నత స్థానంలో పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు జిలాని బాషా, 44డివిజన్ టిడిపి కార్యకర్తలు నరసింహులు, శివారెడ్డి, శ్రీనివాసులు, శ్రీకాంత్, రాజేష్, ఖాజా మొహిద్దీన్, ఫజల్, షామీర్,గణేష్, విష్ణు పాల్గొన్నారు.టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నగరంలోని అన్ని పాఠశాలలు, కళాశాలల ఆవరణలో విద్యార్తులు, అధ్యాపకులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు తిరు మలేష్, సాయి కృష్ణ, లోకేష్, సుమంత్, శివ, మంజునాథరెడ్డి, శ్రీవాణి పాల్గొన్నారు.



నిరాశ్రయుల కేంద్రంలో కేక్ కట్ చేస్తున్న ఖాజాపీర్

మోడీకి బంగ్లాదేశ్ పరిణామాలు తప్పవు

ప్రజాశక్తి - కడప



మాట్లాడుతున్న అలీఖాన్

భారత రాజ్యాంగానికి వ్యతిరేకంగా వక్ఫ్ చట్టం - 1995కు ప్రతి పాదించిన 44 సవరణలను ఆమోదిస్తే ప్రధాని నరేంద్ర మోడీకి బంగాదేశ్‌లో సంభవించిన పరిణామాలు అనుభ వించక తప్పదని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మైనార్టీ ఉపాధ్యక్షుడు పఠాన్ మహమ్మద్ అలీఖాన్ హెచ్చరించారు. కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత రాజ్యాంగం నిర్దేశించిన సర్వ మత, సమాన, సామరస్య, స్వేచ్ఛలకు తీవ్ర వ్యతిరేకంగా రూపొందించిన వక్ఫ్ చట్టం-1995 సవరణలను ముస్లిం మైనార్టీలు, దేశ ప్రజలు తిరస్కరిస్తున్నారని తెలిపారు. వక్ఫ్ చట్టానికి 44 సవరణలతో లోకసభలో ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లుపై కాంగ్రెస్ పార్టీతో పాటుగా విపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయన్నారు. దీంతో ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం వెనక్కు తగ్గి బిల్లును జాయింట్ పార్లమెంటరీ కమిటీకి నివేదించిందన్నారు. ముస్లిం మైనార్టీల ఆస్తులను కాజేసే కుట్రతో ఈ సవరణలు తీసుకొచ్చారని ఆరోపించారు. దేశవ్యాప్తంగా ఉన్న లక్షలాది కోట్ల రూపాయల ఆస్తులను దురాక్ర మణ చేసే ఉద్దేశంతో ప్రధాని నరేంద్ర మోడీ , హోంమంత్రి అమిత్‌షా ఘోర మైన కుట్రకు పాల్పడ్డారని ఆరోపించారు. సమావేశంలో మాజీ కార్పొరేటర్ ఎం. రహమతుల్లాహ్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రఫీ ఖాన్ పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించి పర్యావరణాన్ని కాపాడుకుందాం అని పేర్కొన్నారు. కెవికె మన్వయకర్త డాక్టర్ కె. వీరయ్య పేర్కొన్నారు. గురువారం కృషి విజ్ఞాన కేంద్రంలో తన తల్లి పేరుతో మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి మాతృమూర్తికి గౌరవం ఇవ్వాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం సమన్వయకర్త అంకయ్య కుమార్, కె.వి.కె శాస్త్రవేత్తలు డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ శిల్పకళ, డాక్టర్ మహేష్ బాబు, సాయి మహేశ్వరి, మానస, సురేష్ కుమార్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

సూచనలను పాటిస్తే అధిక లాభాలు

ప్రజాశక్తి - గోపవరం : వ్యవసాయంలో సూచనలను పాటించినప్పుడే పంటలో అధిక లాభాలతోపాటు ఆర్థికంగా అభివృద్ధి సాధ్యమవుతుందని బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు డాక్టర్ మర్రిపాటి నాగరాజ అన్నారు. బద్వేల్ మండలం చింతల చెరువు కొత్తపల్లిలో గొడ్ల వీటి సుబ్బారావు ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో వివిధ రకాల దేశీ వరి సాగును గురువారం పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉత్తమ యాజమాన్య పద్ధతులైన కాలి బాటలు, వరి నారు కొనలు తుంచి నాటడం, ద్రవ జీవామృతం తయారీ వినియోగం వంటి పద్ధతులు ప్రతి రైతు పాటించాలన్నారు. సెప్టెంబర్ 15లోగా ఇ-పంట నమోదు పూర్తి చేయాలన్నారు. వ్యవసాయ అనుబంధ కార్యక్రమాలు పాడి పశువులు చేపట్టాలని చెప్పారు. అనంతరం చింతల చెరువు రైతు సేవా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి పలు దస్త్రాలను పరిశీలించి సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం వ్యవసాయ సహాయకులు పవన్ కుమార్, సహచర రైతులు పాల్గొన్నారు.



ధ్యాన్‌చంద్‌కు నివాళులర్పిస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

క్రీడలకు అధిక బడ్జెట్ కేటాయించాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడలకు అధిక బడ్జెట్ కేటాయించి, క్రీడారంగం అభివృద్ధికి తోడ్పడాలని డివైఎఫ్ఐ పట్టణ సహాయ కార్యదర్శి మహేష్ యాదవ్ కోరారు. జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని గురువారం ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా స్థానిక ప్రభుత్వ బలికల కాలేజీలో ధ్యాన్‌చంద్‌కు నివాళి అర్పించారు. ప్రతి పాఠశాలకు క్రీడా సామగ్రి అందించాలన్నారు. రాష్ట్రంలో క్రీడా మైదానాలు ఆక్రమణ గురి కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో పట్టణ నాయకులు సూరి, రాఘవ, సురేంద్ర, రమేష్ పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడలకు అధిక బడ్జెట్ కేటాయించి క్రీడారంగం అభివృద్ధికి తోడ్పడాలని డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వీరశాలివిజయకుమార్ కోరారు. జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా ఎస్వీ డిగ్రీ కాలేజీలో ధ్యాన్‌చంద్ చిత్ర పటానికి డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రం డేవిడ్, ప్రొద్దుటూరు నాయకులు విశ్వనాథ్, కాంత రవి, శ్రీహరి, శ్రీకాంత్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న బీరం పాఠశాల ఉపాధ్యాయులు

క్రీడల్లో ఉన్నతంగా రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

ఖాజీపేట : క్రీడల ద్వారా మానసిక, శారీరక ప్రశాంతత చేకూరడంతోపాటు జ్ఞాపకశక్తి పెంపొందుతుందని, క్రీడల్లో రాణిస్తే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని యోగి వేమన విశ్వవిద్యాలయ విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని బీరం శ్రీధర్‌రెడ్డి పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంట్ బీరం సుబ్బారెడ్డి, చైర్‌పర్సన్ సరస్వతమ్మ మాట్లాడారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ స్వాతి శ్రీకాంత్, ప్రిన్సిపల్ శ్వేతా, కాలేజీ ప్రిన్సిపల్ హేమచందర్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గురివిరెడ్డి స్వామి ఆరాధనోత్సవాలు

ప్రజాశక్తి - వేంపల్లె

మండలంలోని తాటిమాకులపల్లె గ్రామంలో శ్రీశ్రీశ్రీ యోగానంద గురివిరెడ్డి స్వామి ఆరాధన ఉత్సవాలు గురువారం ఆశ్రమ నిర్వహణ కమిటీ ఘనంగా నిర్వహించింది. కార్యక్రమంలో పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి మాట్లాడుతూ అశాంతితో అలమటిస్తున్న నేటి సమాజానికి ఆధ్యాత్మిక యోగి, గురువులు గురివిరెడ్డి స్వామి సందేశం, జీవన విధానం ప్రతి ఒక్కరికీ ఎంతో అవసరమని తెలిపారు. ఈ సందర్భంగా భగవద్గీత పారాయణం, చెక్కభజన, అన్నదాన కార్యక్రమం, ఎడ్లచే బండ లాగుడు పోటీలను నిర్వహించారు. కార్యక్రమాల్లో టిడిపి వైసిపి, కాంగ్రెస్ నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఇ-పంట నమోదు తప్పనిసరి

వేముల : వేముల రెవెన్యూ పరిధిలో గురువారం అధికారులు ఇ-పంట నమోదు చేశారు. ఇ పంట 2024 ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన ప్రతి పంటను ఇ క్రాప్ పంటలో నమోదు చేసుకోవాలని సూచించారు. రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శించే ఇ-పంట జాబితాలో తమ పేరును ఈకేవైసి చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వేముల ఆర్ఎస్‌కె ఇన్‌చార్జి ఎంపిఇఒ ఎలీషా, విఆర్ఎ రమణయ్య, రైతులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో సబ్‌స్టేషన్ వాచ్‌మెన్ మృతి

ప్రజాశక్తి - సింహాద్రిపురం


బసిరెడ్డి(ఫైల్‌ఫొటో)

మండలంలోని జంగంరెడ్డిపల్లె సబ్‌స్టేషన్ ఫీల్డ్ వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న బసిరెడ్డి(40) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడి బంధువులు కథనం మేరకు.. స్థానిక సబ్‌స్టేషన్‌లో విధి నిర్వహణలో భాగంగా బుధవారం జంగంరెడ్డిపల్లె రోడ్డు క్రాస్ వద్ద మోటర్ బైక్ అదుపుతప్పి కింద పడ్డాడు. స్థానికులు గుర్తించి వెంటనే పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. విషయం తెలుసుకున్న స్థానిక విద్యుత్ శాఖ అధికారులు పులివెందుల ఏరియా ఆసుపత్రికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

సమస్యాత్మక స్థలం కోసం ఘర్షణ

- ఇరువురికి గాయాలు, కేసు నమోదు

ప్రజాశక్తి - చాపాడు


మండల పరిధిలోని వీరభద్రాపురం గ్రామం వద్ద సర్వే నెంబర్ 311-ఏ1లోని 0.28 సెంట్ల సమస్యాత్మక స్థలం విషయమై బుధవారం అర్ధరాత్రి ఇరువర్గాలపై ఘర్షణ చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తుల వివరాల ప్రకారం.. లక్ష్మీపేట గ్రామానికి చెందిన వరికూటి చంద్రఓబుల్‌రెడ్డి, బద్వేలి సురేంద్రనాథ్‌రెడ్డి మధ్య కొంతకాలంగా సర్వే నెంబర్ 311 -ఏ1 స్థలానికి సంబంధించి సమస్య కొనసాగుతోంది. ఇందుకు సంబంధించి జులై 23న రెవెన్యూ సిబ్బంది పరిశీలించి ఉన్నతాధికారుల నుంచి నివేదిక వచ్చే వరకు ఈ స్థలంలో ఏవరూ జోక్యం చేసుకోకూడదని ఆదేశించారు. అంతేకాకుండా ఇరువర్గాలపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. ఈ స్థలంలో చంద్రఓబుల్‌రెడ్డి ఏర్పాటు చేసిన రేకుల షెడ్డును బుధవారం అర్ధరాత్రి సురేంద్రనాథ్‌రెడ్డి వర్గీయులు జెసిబి సాయంతో కూలగొట్టారు. విషయం తెలుసుకున్న చంద్ర ఓబుల్ రెడ్డి కుమారులు, అనుచరులు జెసిబిని నిలివి. వెనుకనే వస్తున్న సురేంద్రనాథ్‌రెడ్డి, చంద్ర మోహన్‌రెడ్డిపై దాడి చేశారు. ఈ సంఘటనలో సురేంద్రనాథ్‌రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి తలకు బలమైన గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఇరువర్గాల ఫిర్యాదుల స్వీకరించి పోలీసులు విచారణ చేస్తు న్నారు. తహశీల్దార్ రవీంద్రారెడ్డిని వివరణ కోరగా తమ దృష్టికి ఎలాంటి పిర్యాదులు అందలేదన్నారు.


కూల్చివేసిన రేకులషెడ్డు, (ఇన్‌సెట్) గాయపడిన చంద్రమోహన్‌రెడ్డి

ప్రభుత్వాస్పత్రిలో మూతపడిన దంత విభాగం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో దంత విభాగం మూతపడడంతో సంబంధిత రోగులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఆహారం నమిలి మింగిన తర్వాత అది శక్తిగా మారి మనిషి ధృఢత్వానికి ఆరోగ్యానికి దారితీస్తుంది. ఇంతటి ప్రాధాన్యత ఉన్న దంతాల ఆరోగ్యానికి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయంపై ఎలాంటి అవగాహన లేకపోవడంతో దంత క్షయానికి గురి అవుతున్న రోగులు ఎక్కువ మంది అవుతున్నారు. ప్రొద్దుటూరు పట్టణంలో ఒకప్పుడు వేళ్లమీద లెక్కించే దంత వైద్యశాలలు నేడు అధిక సంఖ్యలో వెలిశాయి. ప్రయివేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తే రూ.వేలల్లో ఖర్చు అవుతుంది. ఇది పేదలకు మరింత భారంగా పరిణమించింది. ఇలాంటి పరిస్థితుల్లో దంత విభాగానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. ప్రభుత్వాసుపత్రిలోని దంత విభాగానికి గురువారం మధ్యాహ్నం 'ప్రజాశక్తి' వెళ్లి చూడగా.. ఆ ఆస్పత్రి మూతబడి దర్శనమిచ్చింది. ఈ విభాగంలో దంత చికిత్స సంబంధించిన ఒక వైద్యుడు, ఒక సాంకేతిక నిపుణుడు ఉన్నట్లు సమాచారం. దంత వైద్యుడు వారంలో మూడు రోజులు క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లవలసి ఉందని, ఆ వేళల్లో రిమ్స్ దంత వైద్యులు ఇక్కడ విధులు నిర్వహిస్తారని తెలిసింది. ఈ విషయమై ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆనంద్ బాబును వివరణ కోరగా.. సహజంగా రిమ్స్ నుంచి వచ్చే వైద్యులు మధ్యాహ్నం వరకు విధులు నిర్వహిస్తారు, గురువారం కొంత ముందే వెళ్లినట్లు ఉన్నారని సర్ది చెప్పారు. ఏది ఏమైనా రోగులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటానని ఆయన పేర్కొన్నారు.



గిడుగు రామ్మూర్తి తెలుగు భాషోద్ధారకుడు


గిడుగు రామ్మూర్తి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

తెలుగు భాషోద్ధారణ కోసం గిడుగు రామ్మూర్తి ఎనలేని కృషి చేశారని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. వ్యవహారిక తెలుగు భాషోద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు 161వ జయంతిని తెలుగుభాషా దినంగా కాంగ్రెస్ నాయకులు వేంపల్లెలో ఘనంగా నిర్వహించారు. తొలి తెలుగు శాసనం కడప జిల్లా ఎర్రగుంట్ల సమీపాన కలమల్ల గ్రామంలో లభించడం జిల్లాకే గర్వకారణమన్నారు. ఎక్కువ మంది మాట్లాడే భాషల్లో తెలుగు ప్రపంచంలో 7వదిగా పేర్కొన్నారు. దేశంలో 4వదిగా తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుబ్రమణ్యం, రామకృష్ణ, బాబు, అమర్‌నాథ్‌రెడ్డి, ఉత్తన్న, బాలం సుబ్బరాయుడు, వేమారాజా, వినయ్, వేమయ్య, మదార్, నాగరాజు, రవి, వెంకటేష్, మహబూబ్ బాషా పాల్గొన్నారు. స్థానిక శ్రీచైతన్య, జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో మాతృభాష, క్రీడా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీ చైతన్య పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి, బాలికల పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు చెరుకూరి శ్రీనువాసులు మాట్లాడారు. పదో తరగతిలో తెలుగులో వంద మార్కులు సాధించిన విద్యార్థులకు తెలుగు ఉపాధ్యాయురాలు ఉషారాణికి పాఠశాల తరుపున జ్ఞాపికను అందజేశారు. ట్రిపుల్‌ఐటిలో కూడా ఆయా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు చేతన్‌రెడ్డి, చైతన్యరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముద్దనూరు : క్రీడలకు ధ్యాన్‌చంద్, తెలుగు భాషకు గిడుగు రామ్మూర్తి వన్నె తెచ్చిన మహోన్నత వ్యక్తులని బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజ బాబు తెలిపారు. జాతీయ క్రీడా, తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ధ్యాన్‌చంద్, గిడుగు రామ్మూర్తి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా 9వ తరగతి విద్యార్థి లక్ష్మీకాంతరెడ్డి గురజాడ అప్పారావు వేషధారణలో అలరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అన్వర్ బషా, సుబ్రహ్మణ్యం, రాజేశ్వరి, రామసుబ్బమ్మ, పీడీ మాధవరెడ్డి పాల్గొన్నారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న శ్రీనివాసులు

జమ్మలమడుగు రూరల్ : భారతీయ భాషల్లో మేటి తెలుగు అని ఎంఇఒ చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం గూడెం చెరువు ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు కవిత అధ్యక్షతన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖరరావు తెలుగు భాష గొప్పతనం, తెలుగు భాష తియ్యదనం మరే భాషకు లేదని కొనియాడారు. ఉపాధ్యాయులు గురుకుమార్, విద్యాసాగర్ జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవం గురించి విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయులు వెంకటసుబ్బయ్య, సుజాత, మంజుల, విద్యార్థులు పాల్గొన్నారు.

కడప అర్బన్ : పాత కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్న జిల్లా పెన్షన్ల సంఘం కార్యాలయంలో గిడుగు వెంకట రామ్మూర్తి 161వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి జిల్లా పెన్షన్ల ల సంఘం ప్రధాన కార్యదర్శి ఎన్. రామ్మూర్తి నాయుడు పూలమాలవేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కోశాధికారి నగేష్, జిల్లా పెన్షన్ల సంఘం ఉపాధ్యక్షుడు శంకరయ్య, నారాయణ, మల్లయ్య, వెంకటసుబ్బయ్య, రాయుడు, నాగమల్లన్న, శ్రీనివాసులు, రాధాకృష్ణ మూర్తి, సుబ్బరాయుడు పాల్గొన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయం తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. మొదటిగా గిడుగు రామ్మూర్తి గారి చిత్రపటానికి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అమీరుద్దీన్ పూలమాలో లు వేసే నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ పవన్ కుమార్, అసిస్టెంట్ లైబ్రరియన్ నాదెండ్ల బాబ్జి, లైబ్రేరియన్ సుబ్రహ్మణ్యం, జిల్లా గ్రంథాల సంస్థ కార్యాలయ సిబ్బంది సీనియర్ అసిస్టెంట్ రాజకుమార్, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసచారి, పాఠకులు పాల్గొన్నారు. **కమలాపురం :** పెద్దచెప్పలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా, క్రీడా దినోత్సవాలు నిర్వహించారు. మొదట గిడుగు రామమూర్తి పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డి.కె.చదువులబాబు, ప్రధానోపాధ్యాయుడు ఓబుల రెడ్డి, తెలుగు భాషోపాధ్యాయుడు ఎం. సి. రాజశేఖరరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు ఎల్ అబ్రహం సునీల్, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యనభ్యసించిన చోటే పనిచేయడం సంతోషం

ప్రశంసాపత్రాలు అందుకోవడం మరపురాని అనుభూతి : మున్సిపల్ కార్పొరేషన్ ఎస్ఇ కింతలి రత్నాలరాజు

ప్రజాశక్తి - కడప అర్బన్



విధి నిర్వహణలో అంకితభావంతో పని చేసి ఎంతో మంది మంత్రులు, అధికారుల చేత ప్రశంసా పత్రాలు అందుకోవడం మరపురాని అనుభూతిని మిగిల్చిందని మున్సిపల్ కార్పొరేషన్ ఎస్ఇ కింతలి రత్నాలరాజు అన్నారు. గురువారం ఆయన ప్రజా శక్తితో మాట్లాడుతూ తమ సొంతూరు శ్రీకాకుళం జిల్లా, లావేరు మండలం, గోర్లపేట గ్రామమని తెలి పారు.తల్లిదండ్రులు కింతలి కనకరాజు, మహాలక్ష్మి, విద్యాభ్యాసం 1-3 తరగతులు స్వగ్రామమైన గోర్లపేటలో, 4 నుంచి 10 వరకు శ్రీకాకుళం జిల్లాలో సాగిందని తెలిపారు. డిప్లొమా సివిల్ ఇంజినీర్ విద్యను గవర్నమెంట్ పాలి టెక్నిక్ కళాశాలలో అభ్యసించి, 1982లో ఎంప్లాయింట్ ద్వారా పంచా యతీరాజ్‌లో వర్క్‌ఇన్‌స్పెక్టర్‌గా సోమ్‌పేట మండలంలో ఉద్యోగబాధ్యతలు చేపట్టానని చెప్పారు. 1987 వరకు పని చేశానని, తరువాత రాజీనామా చేసి అదే ఏడాది మరోమారు ఎంప్లాయిమెంట్ ద్వారా మున్సిపల్ కార్పొరేషన్ వైజాగ్‌లో అసిస్టెంట్ ఇంజినీర్‌గా ఉద్యోగంలో చేరానని వెల్లడించారు. తరుఆవత బదిలీపై శ్రీకాకుళం మున్సిపాలిటీలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్‌గా 1999 వరకు పని చేశానని చెప్పారు. 2000లో బదిలీపై పలాసా కాశిబుగ్గ మండలం నగర పంచాయతీలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్‌గా 10 నెలలు, 2001 నుంచి 2003 వరకు శ్రీకాకుళం మున్సి పాలిటీలో ఎఇఇగా విధులు నిర్వహించానని వివరిం చారు. అదే ఏడాది ఉద్యోగోన్నతి పొంది డిఇఇగా వైజాగ్ పబ్లిక్‌హెల్త్ ప్రాజెక్టు డివిజన్‌లో 2005 వరకు పని చేశానని తెలిపారు. 2009 మేలోఉద్యోగోన్నతి పొంది ఇఇగా నెల్లూరు జిల్లాలో 3 నెలలు పని చేశానని పేర్కొన్నారు. జులైలో బదిలీపై శ్రీకాకుళం మున్సిపాలిటీలో ఇఇగా 2010 వరకు పని చేశానని తెలిపారు. 2011లో విశాఖలో జివిఎంసి ఇఇగా, 2015లో సిఇ వద్ద పిఎగా పని చేశానన్నారు. 2019 వరకు స్ట్రీట్ లైట్ ఎఇఇగా విధులు కొనసాగించానని, 2020 నుంచి 2022వరకు జ్ఞానపురం, మల్కాపురం జోనల్లో పబ్లిక్ వర్క్స్ ఇఇగా పని చేశానని వివరించారు. 2022లో ఉద్యోగోన్నతి పొంది కడప మున్సిపల్ కార్పొరేషన్ ఎస్ఇగా వచ్చా నని చెప్పారు. ఈ నెల 31న ఉద్యోగ విరమణ చేయనున్నానని పేర్కొన్నారు. 42ఏళ్ల విధి నిర్వహణలో వైజాగ్‌లో మురికివాడ అభివృద్ధి పథకం కింద నిధులు ఎలా ఖర్చు చేయాలనే అంశంపై లండన్‌లో శిక్షణ తీసుకున్నానని తెలిపారు. 2012-19 వరకు అప్పటి ప్రభుత్వం ఎల్ఇడి స్ట్రీట్‌లైట్స్‌ను పైలెట్ ప్రాజెక్టుగా వైజాగ్‌ను ఎంపిక చేసిందని చెప్పారు. ఈ ప్రాజెక్టు పనులలో ఇఇగా తాను పని చేయడం గర్వంగా ఉందన్నారు. కడప నగరంలో కమిషనర్ ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ విభాగంలో పని చేయడం సంతృప్తినిచ్చిందని పేర్కొన్నారు. సర్కిళ్ల అభివృద్ధి చేశామని తెలిపారు. తన సేవలు గుర్తించిన ప్రభుత్వం అనేక ప్రశంసా పత్రాలను అందించిందని చెప్పారు.

మైనింగ్ మాఫియా ఆగడాలను అరికట్టాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగు ప్రాంతంలో అక్రమంగా తరలిపోతున్న మైనింగ్ మాఫియాకు అధికార యంత్రాంగం అడ్డుకట్ట వేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి జి.ఏసుదాసు డిమాండ్ చేశారు. స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ ఎర్రమట్టి తవ్వకాలు, సుద్ద, ఇసుక ఇలా అనేక రకాల ప్రకృతి వనరులు అక్రమంగా తరలిపోతుంటే ప్రభుత్వ అధికా రులు ఏమాత్రం చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో కూడా అక్రమంగా ఇసుక, మైనింగ్ తరలిస్తుంటే ఈ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించారని తెలిపారు. కానీ రాష్ట్రంలో ప్రభుత్వాలు మారినా ప్రభుత్వాధికారులు మారలేదన్నారు. కనీసం కూటమి ప్రభుత్వమైనా ఈ మైనింగ్ మాఫియాకు అడ్డుకట్ట వేస్తుందని ప్రజలు భావించారు. కానీ యదాతథంగా గ్రావెల్, సుద్ద, ఇసుక, మైనింగ్ మాఫియా కొనసాగుతూనే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే చాలా వరకు కొండ ప్రాంతమంతా తరిగిపోయిందన్నారు. కొండ ప్రాంతాలు బాగుండాలంటే అక్రమం మైనింగ్ మాఫియాపై ఉక్కుపాదం మోపాలన్నారు. మైనింగ్ మాఫి యాకు సహకరిస్తున్న ప్రభుత్వ అధికారులపై కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జమ్మలమడుగు ప్రాంతంలో జరుగుతున్న అక్రమ మైనింగ్‌పై దృష్టి సాధించి చర్యలు చేపట్టాలని కోరారు. లేకుంటే ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం సభ్యులు వినయ్‌కుమార్, నరేంద్ర, మోషా పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిపిఎం పట్టణ కార్యదర్శి ఏసుదాసు



ప్రయివేట్ ఆస్పత్రులను తనిఖీ చేస్తున్న అధికారులు

ప్రయివేట్ ఆస్పత్రుల్లో తనిఖీలు

-ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - ఖాజీపేట

మండలంలో ప్రయివేట్ వైద్యశాలలు నిబంధనలను అతిక్రమించి 'పుట్టగొడుగుల్లా ప్రయివేట్ వైద్య శాలలు' శీర్షికన ప్రజాశక్తి దినపత్రికలో గురువారం ప్రచురితమైన కథనానికి జిల్లా వైద్య అధికారులు, స్థానిక వైద్య అధికారులు స్పందించారు. ప్రయివేట్ ఆస్పత్రులను తనిఖీ చేసి నోటీసులు జారీ చేశారు. స్థానిక వైద్యురాలు ముబీన్, ఎంపీహెచ్ఈఓ నాగభూషణం, సిబ్బంది తనిఖీ చేశారు. కొందరికి నోటీసులు జారీ చేశారు. ప్రయివేట్ క్లినిక్‌లలో సదుపాయాల గురించి, రోగుల వసతుల లభ్యత గురించి ఆరా తీశారు.

తెలంగాణ గ్లోబల్ ఐటి సమ్మిట్‌లో వేంపల్లె వాసి

ప్రజాశక్తి - వేంపల్లె


తెలంగాణ ఐటి మంత్రితో కలిసి విలేకరుల సమావేశంలో పాల్గొన్న సునీల్ కుమార్‌రెడ్డి

తెలంగాణలో పరిశ్రమల పెట్టుబడికి సంబంధించి జరిగిన గ్లోబల్ ఐటి సమ్మిట్‌లో వేంపల్లెకు చెందిన సునీల్ కుమార్‌రెడ్డి హాజరయ్యారు. గ్లోబల్ బిజినెస్ స్ట్రాటజీ లీడర్‌గా పేరుగాంచిన సునీల్ కుమార్‌రెడ్డి ఇటీవల తెలంగాణ గ్లోబల్ ఐటి సమ్మిట్‌లో పాల్గొని, తెలంగాణ ఐటి మంత్రితో వ్యూహాత్మక చర్చలు జరిపారు. రాష్ట్రానికి ప్రపంచ పెట్టుబడులను ఆకర్షించడంతోపాటు ప్రత్యేకించి ఎఐ, ఎంఎల్, డెలివరీ రంగాల్లో ఇన్నోవేషన్, ఆర్‌అండ్‌డి కేంద్రాల స్థాపనపై ప్రధానంగా చర్చించినట్లు సునీల్ కుమార్‌రెడ్డి చెప్పారు. తెలంగాణలో సెమీ కండక్టర్, మొబిలిటీ కేంద్రాల ఏర్పాటుపై గ్లోబల్ కంపెనీల ఆసక్తిని ఐటి మంత్రి శ్రీధర్ దృష్టికి తెచ్చినట్లు చెప్పారు. పెట్టుబడులను సులభతరం చేయ డంతోపాటు తెలంగాణ అత్యాధునిక సాంకేతికంగా, పరిశోధనలకు అనుకూల మైన వాతావరణాన్ని సృష్టించడం, ఆర్థిక వృద్ధిని పెంచడం, ఎక్కువగా ఉపాధి అవకాశాలను అందించడం లక్ష్యంగా గ్లోబల్ బిజినెస్ పని చేస్తుందని చెప్పారు. అంతర్జాతీయ టెక్నాలజీ కంపెనీలకు ప్రాధాన్యత కలిగిన గమ్య స్థానంగా తెలంగాణ కీర్తిని పెంచుతాయని చెప్పారు. టెక్ పరిశ్రమలో అగ్ర గామిగా ఎదగడం జరుగుతుందని వివరించారు. గ్లోబల్ ఐటి సమ్మిట్‌లో ఐటి మంత్రితో పరిశ్రమల పెట్టబడ్డులపై చర్చించినట్లు చెప్పారు.


బహుమతిని అందుకుంటున్న విద్యార్థి

కంటి జాగ్రత్తల పట్ల అవగాహన ఉండాలి

ప్రొద్దుటూరు : ప్రతి ఒక్కరూ కంటి జాగ్రత్తల పట్ల అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ డిఎంహెచ్ఓ శివప్రసాదరెడ్డి అన్నారు. స్థానిక జిన్నా రోడ్డులోని ఉర్దూ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో గురువారం జిల్లా అంధత్వ నివారణ సంఘం అధ్వర్యంలో నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా కార్యక్రమం నిర్వహించారు. శరీరంలోని అన్ని అవయవాల కంటే కన్ను చాలా ప్రధానమని శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆప్తాల్మిక్ అధికారి రఘురామిరెడ్డి మాట్లాడుతూ నేత్రదానం వల్ల ఇరువురి అంధు లకు వెలుగును ప్రసాదించవచ్చన్నారు. మన దేశంలో సుమారు 12లక్షల మంది పూర్తి చూపులేని అంధులు ఉన్నారన్నారు. నేత్రదానానికి ముం దుకు రావా లని ప్రతిజ్ఞ చేయించారు. నేత్రదాన అవగాహనపై నిర్వహించిన పరీక్షలలో విజేతలకు బహుమతులు అందజేశారు. హెల్త్‌ఎడ్యుకేషన్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, ఆప్తాల్మిక్ ఆఫీసర్ తేజ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కోళ్లు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపల్ శ్రీనివాస ప్రసాద్

పెరటి కోళ్ల పెంపకం.. లాభదాయకం

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : పెరటి కోళ్ల పెంపకం వల్ల అధిక ఆదాయాన్ని పొందవచ్చునని పశు వైద్య కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస ప్రసాద్ తెలిపారు. స్థానిక పశువైద్య కళాశాలలో గురువారం పశుగణ క్షేత్ర విభాగం ఆధ్వర్యంలో ఎస్సీ రైతుల సంక్షేమం కోసం పెరటి కోళ్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరటి కోళ్ల పెంపకం తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం పొందవచ్చు అన్నారు. కోడిగుడ్లు, మాంసం ద్వారా ప్రోటీన్‌తో కూడిన మాంసాహారం లభిస్తుందన్నారు. ఆ ఆదాయంతో ఆహార భద్రత చేకూరుతుందని పేర్కొన్నారు. పెరటి కోళ్ల పెంపకంతో ఆదాయంపై అవగాహన కల్పించారు. అనంతరం 50 మంది రైతులకు 8 ఆడ కోళ్లను, రెండు మగ కోళ్లను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ పి.పాండురంగారెడ్డి, డాక్టర్ రాయల్‌రెడ్డి, డాక్టర్ అశోక్, డాక్టర్ ఇందిర, సిబ్బంది పాల్గొన్నారు.